క్రైం కథ

**'వ**రవీణా మృదుపాణీ వనరుహలోచనురాణీ ...' గీతాన్ని వీణ మీద పలికిస్తోంది అఖిల. ఎదురుగా పదేళ్లలోపు పిల్లలిద్దరు ఆమె చెప్పిన పాఠాన్ని వల్లె వేస్తూ మీటుతున్నారు. సంగీతం పాఠం చెబుతూ చెబుతూ అప్పుడప్పుడు గుమ్మంలోంచి వీధి వైపు చూస్తోంది అఖిల. వీధిలో రోడ్డు మీద సరిగ్గా తమ గేటు ముందర ఒక వ్యక్తి మోటారు సైకిలు బాగుచేసుకుంటున్నాడు. వెడుతూ వెడుతూ దారిలో మొరాయించిందేమో, దాన్ని రిపేరు చేస్తూ కుస్తీ పడుతున్నాడు.

# మించిపోతే...

**-సరసి**

పాఠం పూర్తయింది. పిల్లలిద్దరూ తమ వీణలకి కవర్లు తొడిగి, గురువు గారికి నమస్కారం చెప్పి వెళ్లిపోయారు. వాళ్లని సాగనంపడానికి గేటు దాకా వచ్చింది అఖిల. వీధిలో బండి రిపేరు మాత్రం పూర్తి కాలేదు. ఆయనకు యాభయ్యేళ్లుంటాయేమో. లావుగా ఉన్నాడు. రాజకీయ నాయకుడిలా ఖద్దరు లాల్చీ, పైజమా. బొద్దు మీసాలు, నుదుట కుంకుమ బొట్టు.


ఆమెను చూడగానే రిపేరు ఆపి, గట్టిగా ఓసారి నిట్టూర్చాడాయన. "బండి సడన్‌గా ఆగిపోయిందమ్మా. ఏం ప్రాబ్లమ్మో తెలియడం లేదు. దగ్గర్లో మెకానిక్కు కూడా ఎవడూ లేడు. మీరేం అనుకోకపోతే బండిని లోపల పెడతాను. రేపొద్దున్న వచ్చి పట్టుకెడతా." ప్రాధేయపూర్వకంగా అడిగేసరికి అఖిల కాదనలేకపోయింది. ఎందుకంటే ఆయన చాలా సేపట్నుంచీ సిన్సియర్‌గా రిపేరు చేయడం చూస్తోందామె.

చేతిలోని రెంచి, స్క్రూడ్రైవరు మోటారు సైకిలు కున్న చిన్న డిక్కీ అందులో పడేసి, బండిని తెచ్చి గేటులోపల పెట్టాడాయన. తర్వాత నుదుటికి పట్టిన చెమటను తుడుచుకుని "నాపేరు అంకయ్యమ్మా. ఇది నా అడ్రసు, ఫోను నెంబరూ. రేపు ఉదయం నేను గానీ, మా అబ్బాయి గానీ వచ్చి పట్టుకెడతాం. మీకు శ్రమ ఇచ్చినందుకు మన్నించాలి."

పెద్దాయన అంత మాట అనేసరికి అఖిల మనస్సు అదోలా అయ్యింది. "అయ్యో, దానికేం భాగ్యమండీ. నా పేరు అఖిల. ఎప్పుడొచ్చినా ఫరవాలేదు ఇంట్లోనే ఉంటాను."

అఖిల తండ్రి పోయి రెండేళ్లయ్యింది. తండ్రి గవర్నమెంటు టీచరుగా చేసినందున, ఆయన చనిపోయాక తల్లికి పెన్షను వస్తోంది. అదే ముఖ్యాధారమైంది ఇల్లు గడవడానికి. తను డిగ్రీ వరకూ చదువుకున్నా అది ఉద్యోగానికి సరిపోలేదు. సరదాగా నేర్చుకున్న సంగీతమే అంతో ఇంతో తిండి పెడుతోంది.

రాత్రంతా అఖిలకి నిద్రలేదు. గేటుకి తాళం వేసింది కానీ, బండినెవరైనా గోడమీద నించి ఎత్తుకుపోతారేమో నన్న భయం ఆమెకు సుఖం లేకుండా చేసింది.




తెల్లారింది. ఉదయం పది గంటలైనా అంకయ్య గారు గానీ, వాళ్లబ్బాయి గానీ ఎవరూ రాలేదు. సాయంత్రమైనా రాలేదు. ఏమిటిది? ఎందుకు రాలేదు? మరిచిపోయారా? మరిచిపోయేంత చిన్న విషయమా? ఆ బండిని వదిలించుకునే దాకా మనశ్శాంతి లేని పరిస్థితి వచ్చింది అఖిలకు.

మూడోరోజు ఉదయమే ఓ పాతికేళ్ల లోపు కుర్రాడు వచ్చాడు. వచ్చి తను అంకయ్య గారి కొడుకునని పరిచయం చేసుకున్నాడు. అతడు బండి కోసం వచ్చాడని అర్థమయ్యాక అఖిల కోపం తమాయించుకోలేకపోయింది. అతడి గుండు చూస్తూ "ఏం బాబూ. బండికి నన్ను గార్డుగా పెట్టి, మీరు తిరపతో, యాదగిరిగుట్టో వెళ్లినట్టున్నారు. నేనిక్కడ ఛస్తున్నాను దీన్ని చూడలేక. పోనీలే కదా అని ఒప్పుకుంటే బండి నిక్కడ పెట్టేసి ఇన్ని రోజులా?"

"సారీ ఆంటీ. మీ ఇంట్లో బండి పెట్టి వచ్చేక డాడీ మాకు చెప్పారు. పొద్దున్నే వెళ్లి బండి తెమ్మని. కాని, ఆ రాత్రే ... ... ఆ రాత్రే మానాన్న గారికి హార్ట్ ఎటాక్ వచ్చింది. హాస్పిటల్లో చేర్చాం. నిన్న ఆయన పోయారాంటీ!" అన్నాడు బాధగా.

అఖిల గుండె నీరైపోయింది. "అయ్యయ్యో ఎంత పని జరిగిందీ. అనారోగ్యంగా కూడా ఏం కనబడలేదు. సారీ నాయనా. నేను తొందరపడి ఏదో అన్నాను. నాకేం తెలుసు

మీకింత కష్టం వస్తుందని." తను తొందరపడినందుకు నొచ్చుకుంది. తర్వాత రమేష్ ఆమెకు కృతజ్ఞతలు చెప్పి, బండి నడిపించుకుంటూ వెళ్లిపోయాడు. అఖిలకి ఆ రోజల్లా గుర్తొస్తూనే ఉంది ఆ సంఘటన.

***

రెండు రోజుల తర్వాత ఉదయాన్నే ఎవరో తలుపు తడితే తీసింది అఖిల. వచ్చిన వ్యక్తిని చూస్తూనే కెవ్వున కేక పెట్టి రెండడుగులు వెనక్కి వేసింది.

అంకయ్య!! అతడి వెనకే ఒక యువకుడు.

"ఏంటమ్మా? ఏమైందీ?" భయంతో చెమటలు పట్టిన అఖిలను చూస్తూ ప్రశాంతంగా అడిగేడు అంకయ్య.

"మీరు... మీరు..." ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో తెలియక తత్తర పడుతున్న అఖిలను చూసి, "కాసిని మంచి నీళ్లివ్వండమ్మా అమ్మాయికి!" అన్నాడు అంకయ్య అఖిల వెనక వస్తున్న ఆమె తల్లిని చూసి.

స్థిమిత పడిన అఖిల నుంచి మెల్లగా వివరాలన్నీ తెలుసుకుని ఫకాలున నవ్వేడు అంకయ్య గారు. "నిన్నెవరో నిలువునా మోసం చేశారమ్మా. నేను చనిపోవడం ఏవిటి? అర్జంటుగా కరీంనగర్ వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడే వస్తున్నాను అక్కణ్ణుంచి. ఇంకా ఇంటి క్కూడా వెళ్లలేదు. ఇదిగో చేతిలో బ్యాగ్ చూడు!"

"మరి మీ అబ్బాయి అలా చెప్పేడేంటీ బండి పట్టుకెడుతూ?"

"బండి పట్టుకెళ్లాడా? మా అబ్బాయా?" ఆశ్చర్యపోతూ పక్కనే నిలబడ్డ యువకుడి వైపు చూస్తూ "ఏరా బండి పట్టుకొచ్చేశావా?"


"నేనా? నేనెప్పుడు పట్టుకెళ్లాను?" ఆశ్చర్యపోయాడా యువకుడు.

"ఈయన కాదు. వేరే కుర్రాడు గుండుతో ఉన్నాడు."

"నాకు వీడొక్కడే కొడుకు రమేష్. వీడికి కాక మరెవరి కిచ్చారు బండినీ? ఎవరో తెలివిగా నిన్ను మోసం చేశారమ్మా!" అంకయ్య ఆలోచనలో పడ్డాడు. "నీతో నేను వీధిలో మాట్లాడుతున్నపుడు రోడ్డు మీద ఎవడో వినుండాలి. విని, నా కొడుకు నని చెప్పి, బండి పట్టుకుపోయాడు బద్మాష్." అన్నాడు అంకయ్య. గుండె దడదడ లాడింది అఖిలకి.

"మరిప్పుడెలా డాడీ? దాన్ని బేరం పెట్టేం కదా నిన్న?" కొడుకు గుర్తు చేశాడు తండ్రికి.

"అవునమ్మా. నాలుగు రోజుల్లో నా కూతురి పెళ్లి. దానికి డబ్బు అవసరమయ్యి ఈ బండిని అమ్మకం పెట్టాను. యాభై వేలకి బేరం కుదిరింది. ఇప్పుడా డబ్బు రాకపోతే నేను చాలా ఇబ్బందుల్లో



పడిపోతానమ్మా. పెళ్లాగిపోతుంది!!" అంకయ్య గుండె పట్టుకుని నేల మీద కూర్చిండిపోయాడు. అఖిల కంగారు పడిపోయింది. అతడికి ఒక గ్లాసు మంచినీళ్లిచ్చి పడక్కుర్చీలో కూర్చోబెట్టింది.

అంకయ్య కొడుకు అఖిలని పక్కకి పిలిచి అన్నాడు. "ఆంటీ. మా నాన్న గారికి హై బీపీ. ఇప్పుడిటువంటి ఆటంకాలు వస్తే తట్టుకోలేరు. బండి అమ్మిన డబ్బు రేపు పట్టుకెళ్లి మా చెల్లి అత్తారింట్లో కట్నంగా ఇచ్చిరావాలి. బండి పట్టుకెడుతూ మీక్కూడా శుభలేఖ ఇవ్వాలని నాన్న అనుకున్నారు. ఇదిగో." అంటూ చేతి సంచీలోంచి శుభలేఖల కట్ట తీసి చూపించాడు. అఖిల అవాక్కయ్యింది.

తనిప్పుడేం చెయ్యాలి? పోలీసు కేసు పెడితే ఎప్పటికి తేలుతుంది?" అయినా బండి పోతే కంప్లయింట్ ఇవ్వాలి గానీ, తనే ఎవరికో ధారాదత్తం చేసి కంప్లయింటు ఎలా ఇస్తుంది? ఇప్పుడీ సమస్య ఎలా పరిష్కారం అవుతుంది? బండికి డబ్బు తను కట్టుకోవాలా? పరిస్థితి అలాగే కనపడుతోంది. బండిని తిరిగి వారికి అప్పగించేదాకా బాధ్యత తనదేనా? తీరి కూర్చుని తనెందుకీ సంకటంలో పడింది? తనకి సంబంధం లేదని వాదిస్తే? ఈ పెద్దాయనకి ఏ హార్ట్ ఎటాకో వచ్చి ఇక్కడే హరీ మనడు కదా? జీవితాంతం తన మీద పడి ఏడుస్తారేమో వీళ్లంతా.

"ఆంటీ. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకండి. మేము అందినన్ని చోట్ల అప్పు చేశాం చెల్లి పెళ్లికి. ఇంక మా కంటూ ఎక్కడా చిల్లి గవ్వ కూడా అప్పు పుట్టదు. మీరే ఏదో విధంగా యాభయి వేలు కాకపోయినా, కనీసం నలభై వేలన్నా సర్దుబాటు చెయ్యండి. పెళ్లయ్యాక చూసుకుందాం." అన్నాడు అంకయ్య కొడుకు.

మంచికి పోతే చెడు రావడం అంటే ఇదే. తనిప్పుడు అంత డబ్బు ఎక్కడ నించి తెచ్చిస్తుంది? ఇది అప్పా లేక ఫైనా? ఒకవేళ ఎక్కడో తలతాకట్టు పెట్టి తెచ్చి ఇచ్చినా అది తిరిగి వచ్చే ఆశ కనబడటం లేదు. ఏం కష్టం వచ్చిందిరా భగవంతుడా అనుకుంది అఖిల.

మర్నాడు, ఇంటి కాగితాలు పూచీగా పెట్టి నలభై వేలు అప్పు తెచ్చి అంకయ్య కిచ్చింది అఖిల. అంకయ్య చాలా బాధ పడ్డాడు. "అనవసరంగా నిన్ను ఇబ్బందులు పెడుతున్నానమ్మా. దేవుడు నన్ను క్షమించడు." కళ్లు వత్తుకుంటూ డబ్బు తీసుకుని వెళ్లిపోయాడు అంకయ్య. "పెళ్లికి నువ్వు తప్పకుండా రావాలమ్మా. తిరపతికి రాలేకపోయినా ఇక్కడ రిసెప్షనుకి తప్పకుండా రావాలి. నువ్వు నా కూతురి లాంటి దానివి." అన్నాడు అంకయ్య వెడుతూ వెడుతూ.

ఆలోచించగా ఆలోచించగా అఖిలకి కేసు అర్థమైంది. అంకయ్య కావాలనే ఈ నాటక మాడేడు. దొరలాగా వచ్చి మోసం చేసి, డబ్బు సంపాదించే మార్గం ఇది. హైటెక్ మోసం!!

తనిప్పుడేం చెయ్యాలి? బండి పట్టుకుపోయిన గుండు గాణ్ణి పట్టుకుంటే అంతా తేలిపోతుంది. తన డబ్బో లేక మోటరు సైకిలో దక్కుతుంది. వాణ్ణెలా పట్టుకోవడం? గుండు తప్ప క్లూలేం లేవు. మొహం కాస్త గుర్తుంది. ఈ రెండు ఆధారాలతో వాడిని ఎక్కడ పట్టుకోగలదు తను? నీరసం కమ్మేసిందామెకి. తన దుస్థితికి తనని తానే నిందించుకుని మంచం మీద వాలిపోయింది అఖిల.

"ఆంటీ. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకండి. మేము అందినన్ని చోట్ల అప్పు చేశాం చెల్లి పెళ్లికి. ఇంక మా కంటూ ఎక్కడా చిల్లి గవ్వ కూడా అప్పు పుట్టదు. మీరే ఏదో విధంగా యాభయి వేలు కాకపోయినా, కనీసం నలభై వేలన్నా సర్దుబాటు చెయ్యండి. పెళ్లయ్యాక చూసుకుందాం."

రిసెప్షన్‌కి వెళ్లకూడదని అనుకున్నా, ఆఖరు నిమిషంలో బయల్దేరి వెళ్లింది. ఎందుకంటే అంకయ్యే నిజంగా కావాలని ఇది చేసి ఉంటే, ఆ గుండు గాడు వాళ్ల పరివారంలో వాడే అయ్యుంటాడు కాబట్టి, రిసెప్షన్‌కి రావచ్చు. తనకి దొరకవచ్చు ననే ఆశతో వెళ్లింది.

చిక్కడపల్లిలో స్వగృహంలో చేస్తున్న ఆ రిసెప్షన్‌కి హాజరైన అఖిలని అంకయ్య, అతని భార్య, కుటుంబం అంతా ఎంతో గౌరవించేరు. వెళ్లిపోయేటప్పుడు చీరా, జాకెట్టు పెట్టారు. మా ఇంటి ఆడపడచువన్నారు. ఇవన్నీ నాటకంలో భాగం అని అఖిల మనసులో అనుకుంది. రిసెప్షన్ జరిగినంతసేపూ ఆమె కళ్లు ఆ గుండు గాడిని వెదుకుతూనే ఉన్నాయి. వాడి జాడైతే లేదు. అంకయ్యని తను అనవసరంగా అనుమానిస్తోందేమో. వాడు బయట వాడేనేమో.

ఒకరోజు చీకటితోనే లేచి, చిక్కడపల్లి వెళ్లింది అఖిల. అక్కడ ఇంటింటికీ వెళ్లి బండిమీద కూరలమ్ముతున్న ఒక స్త్రీని పక్కకి పిలిచింది. దూరం నించి అంకయ్య ఇల్లు చూపించి, ఆ ఇంటికి కూరలమ్ముతున్నట్టు వెళ్లి, ఆ ఇంటికి గుండుతో ఎవరైనా ఒక కుర్రాడు ఎప్పుడైనా వస్తే తనకు చెప్పమని, అలాగే ఇంట్లో మోటారు సైకిలు కనిపిస్తే చెప్పమని యాభై రూపాయల నోటు ఆమె చేతిలో పెట్టి, తన ఫోను నెంబరిచ్చింది. పని జరిగేక మరో వంద ఇస్తానని ప్రామిస్ చేసే సరికి, కూరలమ్ముకునే ఆమె ఉత్సాహంగా ఒప్పుకుంది.

అలాగే ఫినాయిల్ అమ్మే ఒక సేల్సు గరల్‌కి కూడా కాస్త డబ్బు ఎర చూపి, గుండుగాడి గుర్తులు చెప్పి, కనిపిస్తే చెప్పమంది. తను కూడా చిక్కడపల్లి ప్రాంతాలన్నీ తిరిగి, కనిపించిన గుండుగాళ్లని, మోటరు సైకిళ్లని నునిశితంగా పరిశీలించసాగింది అఖిల.

నాలుగు రోజులైనా కూరలామె నుంచి గానీ, సేల్సు గరల్ నించి గానీ ఎటువంటి ఫోనూ రాలేదు.

***

నాలుగు రోజుల తర్వాత ఓ రోజు అఖిల బస్సులో నాంపల్లి వెడుతూ ఉండగా ట్యాంకు బండు మీద పోలీసులు ద్విచక్ర వాహనాలు నడిపే వారిని ఆపి లైసెన్సులు చెక్ చేస్తూ కనిపించేరు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండటం వల్ల అఖిల ఎక్కిన బస్సు నెమ్మదిగా వెడుతోంది. కిటికీలోంచి బయటకు చూస్తున్న అఖిల ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రోడ్డు పక్క గుండుగాడు!! లైసెన్సులు చెక్ చేస్తున్న కానిస్టేబుల్‌తో ఏదో చెబుతూ బ్రతిమలాడుతూ కనిపించాడు. అఖిలకి ఎక్కడలేని ఉత్సాహమూ వచ్చేసి, డ్రైవరు దగ్గరకెళ్లి "అన్నా, అన్నా! కొంచెం స్లో చెయ్యవా దిగిపోతాను." అంటూ రిక్వెస్ట్ చేసి, బస్సు స్లో కాగానే హడావుడిగా దిగేసింది.

తన కేసి హడావుడిగా వస్తున్న అఖిలని చూస్తూనే కంగు తిన్నాడు గుండబ్బాయి. పారిపోలేని పరిస్థితి. బండి కానిస్టేబుల్ వద్ద ఉంది. లైసెన్సు లేని వాళ్లని రెండొందలు కట్టమంటున్నాడు. పరిస్థితిని అర్థం చేసుకుని కానిస్టేబుల్‌తో అంది అఖిల. "సార్, ఈయన మా తమ్ముడు. పొరబాటున లైసెన్సు ఇంట్లో మరిచిపోయొచ్చాడు. ఈసారికి వదిలెయ్యండి.

ప్లీజ్." అంది. గుండబ్బాయి ఆశ్చర్యపోయాడు. కానిస్టేబుల్‌కి తనని గురించి కంప్లయింట్ ఇస్తుందేమోనని భయపడిపోయిన వాడు ఆమె కంప్లయింట్ ఇవ్వకపోగా, పైగా తమ్ముడని చెప్పి రక్షించే ప్రయత్నం చేసేసరికి, అలా ఎందుకు చేస్తోందో అర్థం కాలేదతనికి.

"నాక్కాదు. అదుగో అక్కడ ఎస్సైగారు కూర్చున్నారు. ఆయనకి చెప్పుకోండి." అన్నాడు కానిస్టేబుల్. "తమ్ముడూ. నువ్విక్కడే ఉండరా, ఆయనకి చెప్పి వస్తాను." అంటూ అఖిల కొంచెం దూరంలో మోటారు సైకిల్ మీద కూర్చుని చలానాలు రాస్తున్న ఇన్‌స్పెక్టరు దగ్గర కెళ్లి అయిదు నిమిషాలు మాట్లాడి ఆయనను కన్విన్సు చేసింది. గుండబ్బాయికి ఆశ్చర్యంగానూ, భయంగా కూడా ఉంది. ఏం జరుగుతుందోనని కంగారు పడుతున్నాడు.

ఇంతలో ఇన్‌స్పెక్టరు కానిస్టేబుల్‌కి వదిలెయ్యమని సైగ చేశాడు. పోలీసు చెర నించి బయట పడి, మోటారు సైకిలు నడిపించుకుంటూ వస్తున్న గుండబ్బాయితో అంది అఖిల. "ఇది మా ఇంట్లోంచి కొట్టేసిందేనా తమ్ముడూ? భలే నమ్మించావురా నన్ను!" అంటూ స్వంత అక్కలా అభినందించింది. వాడు నవ్వాలో ఏడవాలో తెలియని స్థితిలో ఉండగా మళ్లీ తనే అంది. "నీ గురించి అక్కడే చెప్పి ఉంటే పోలీసులు నిన్ను లోపల పడేసి, ఎముకలు విరిగేలా కొట్టి నిజం చెప్పించి వుండే వారు. చదువుకునే వయసులో ఏదో తెలిసీ తెలియక తప్పు చేస్తే నిన్ను, నీ జీవితాన్నీ నాశనం కాకుండా చూడాలనే నేను కంప్లయింట్ చెయ్యలేదు. అయినా నీ అంతట నువ్వు ఈ పని చెయ్యలేదని నాకు తెలుసు. నిన్ను ఎవరో ప్రేరేపించి, ఇది చేయించారు. వాళ్లెవరో చెప్పు. నీ మీదకి రాకుండా చూస్తాను. ఈ అవకాశాన్ని పోగొట్టుకోకు. వాళ్లెవరో నాకు చెప్పకపోతే, నీమీద కేసు పెట్టక తప్పదు నాకు. అప్పుడు నువ్వు పశ్చాత్తాప పడినా ప్రయోజనం ఉండదు. బుద్ధిమంతుడిలా కనిపిస్తున్నావు. నడు, వాళ్లెవరో చూపించు. నువ్వు చేసిన ఆ పాడు పని వల్ల నేను నలభై వేల రూపాయలు అప్పు చేసి కట్టాల్సి వచ్చింది. నువ్వు నాకు నష్టం కలిగించినా నాకు నీమీద కోపం లేదు. నిజం చెప్పు." అంది అఖిల. అంత ఆప్యాయంగా మాట్లాడినందుకు, పోలీసు తన్నుల నుంచి రక్షించినందుకూ అంతవరకూ ఆశ్చర్యపోతున్న అతగాడిలో కాస్తంత ఆత్మీయతాభావం కలిగినట్లయింది. "అంతా చెబుతాను నాతో రా అక్కా!" అన్నాడు.

అతడి వెనకే బండి మీద కూర్చుని బయలుదేరిన అఖిలకి తన పేరు సునీల్ అని చెప్పి, తన చేత ఆ పని చేయించిన వారి వివరాలన్నీ చెప్పాడు. దిల్‌షుక్‌నగర్‌లో ఒక కాంప్లెక్స్ చేరుకుని, అందులో మూడో ఫ్లోరులో ఉన్న ఒక ఫ్లాట్‌లోకి ఆమెని తీసుకెళ్లాడు సునీల్.

బెల్ కొట్టగానే ఒక వ్యక్తి వచ్చి తలుపు తీశాడు. "ఒరేయ్ మన వాడు పకోడీలతో బాటు ఓ మాంచి పిట్టని కూడా కొట్టుకొచ్చేడ్రోయ్." అన్నాడు లోపల కూర్చున్న మరో నలుగురు యువకులనుద్దేశించి. సునీల్ అఖిల లోపలకి అడుగుపెట్టగానే వాడు తలుపు వేసి గడియపెట్టాడు.

లోపల కుర్రాళ్లందరూ ఆనందపడిపోయారు.

"ఏరా! పట్టుమని ఇరవయ్యేళ్లు కూడా లేవు. అప్పుడే ఇంత హైటెక్ మోసం ఎక్కడ నేర్చావురా? అనవసరంగా మీ నాన్న గారిని అనుమానించాను కదరా. ఆయనకి నీ సంగతి తెలిస్తే తట్టుకోగలరా?"

వాళ్లందరూ టీవీలో బ్లూ ఫిలిం వేసుకుని చూస్తూ, మద్యం సేవిస్తున్నారు. ఆ వేడిలో ఒకమ్మాయిని సునీల్ తీసుకురాగానే వాళ్లందరూ ఉత్సాహంగా కేరింతలు కొట్టేరు. అందులో ఒకడు మాత్రం కొయ్య బొమ్మలా బిగిసిపోయాడు అఖిలని చూస్తూనే. వాడు అంకయ్య కొడుకు రమేష్.

ఆమె వాడిని గుర్తు పట్టింది. డైరెక్టుగా అతడి దగ్గరకెళ్లి లాగి గూబ మీద ఒకటి కొట్టింది. "ఏరా! వట్టుమని ఇరవయ్యేళ్లు కూడా లేవు. అప్పుడే ఇంత హైటెక్ మోసం ఎక్కడ నేర్చావురా? అనవసరంగా మీ నాన్న గారిని అనుమానించాను కదరా. ఆయనకి నీ సంగతి తెలిస్తే తట్టుకోగలరా?" అంది స్కూలు టీచరు పిల్లల్ని మందలిస్తున్నట్టు.

అప్పటికే మద్యం మత్తు, అశ్లీల చిత్రం తాలూకు ప్రభావం వాళ్ల మీద బాగా పని చేస్తున్నాయి. అటువంటి పరిస్థితిలో ఎవర్తో ఒక ఆడది వచ్చి, తమలో ఒకడిని కొట్టడం సహించలేకపోయారు. ఓ బూతు కూత కూసి అఖిల మీద దాడి చేశాడు ఒకడు. వెంటనే వాడికి మరో ఇద్దరు సాయం చేశారు. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆమెను రక్షించడానికి సునీల్ ముందుకు దూకేడు. సునీల్ ఆ విధంగా అడ్డుకుంటాడని వాళ్లూహించలేదు. ఒకడు సునీల్‌ని పక్కకి లాగి ఒక్క తన్ను తన్నేడు మిత్రద్రోహం చేసినందుకు. ఇంతలో తలుపు కొట్టారెవరో.

రమేష్ వెళ్లి తలుపు తీశాడు. ఎదురుగా పోలీస్ ఇన్‌స్పెక్టర్. అంతకు ముందు ట్యాంక్ బండ్ మీద వాహనాలన్నీ ఆపి చెక్ చేస్తున్న పోలీసు ఇన్‌స్పెక్టర్‌కి సునీల్ తనింట్లో బండిని దొంగిలించిన విషయం రహస్యంగా చెప్పి, తన వెనకనే వస్తే మొత్తం ముఠా దొరికే అవకాశం ఉందని చెప్పి, అఖిల రిక్వెస్టు చేసి ఉంటుందని ఏ మాత్రం అప్పుడు సునీల్ ఊహించలేదు. అఖిల ఇన్‌స్పెక్టరుకు 'థ్యాంక్స్' చెబుతున్నప్పుడు అర్థమైందతనికి. సునీల్‌తో కలిసి అతడి మోటారుసైకిల్ మీద అఖిల వెడుతుండగా, ఆమె కోరినట్లుగా వాళ్ల వాహనాన్ని ఫాలో అవుతూ, సరైన సమయానికి లోపలికి వచ్చాడు ఇన్‌స్పెక్టర్.

తర్వాత, అంకయ్యని పిలిపించగా హడావుడిగా అక్కడికి వచ్చాడు. జరిగిందంతా తెలుసుకుని, కొడుకు చేసిన నిర్వాకానికి తల వంచుకున్నాడు. తన వల్లనే ఆమె ఇబ్బందులు పడిందని పదే పదే క్షమాపణలు చెప్పుకుని, ఆమె తనకిచ్చిన డబ్బంతా, బండి అమ్మేసి, నాలుగు రోజుల్లో ఇచ్చేస్తానని ప్రామిస్ చేశాడు.

ఈలోగా కుర్రాళ్లందరినీ ఇన్‌స్పెక్టరు విచారించేడు. మోటరు సైకిల్ దొంగతనం తప్ప మరే నేరాలు చేయలేదని నిర్థారించుకున్నాడు. సినిమాలు, అశ్లీల సాహిత్యం యువకుల మీద దుష్ప్రభావాన్ని చూపిస్తున్నాయని, స్వతహాగా వాళ్లందరూ మంచి వాళ్లేనని, కాబట్టి కేసు లేకుండా వాళ్లని వదిలెయ్యమని అఖిల ఇన్‌స్పెక్టర్‌ని ప్రాధేయపడింది. తను కేసు పెట్టడం లేదని చెప్పి, పెడితే వాళ్ల జీవితాలు నాశనమవుతాయని అఖిల అతడిని రిక్వెస్టు చేసింది. పోలీసుల చేతిలో నరకం అనుభవించవలసి వస్తుందని అంతవరకూ భయంతో వణికిపోతున్న ఆ కుర్రాళ్లందరికీ ఆ క్షణంలో అఖిలలో ఒక అక్క, ఒక అమ్మ కనిపించడంతో అప్రయత్నంగా చేతులు జోడించారు. ■